మీర:—ఆమె భక్తురాలు. కల్లకపటములను తెలిసికోలేని కలికిహృదయమునుండి ఆమె భక్తిరేకులను విరిసికొన్నది. ప్రసవమూర్తి తన నిండారు జీవితమును విచ్చికొన నెంత పరివేదన ననుభవించునో అంత పరివేదన ననుభవించి ఆమె భక్తి విప్పారినది. ఆమె భక్తిలో వజ్రవైడూర్యగోమేధ కాంకితమయిన కిరీటము నిర్లక్ష్యమున ధూళిపాళిలో దొరలిపోయినది. మృత్యుభీషణమయిన కాలకాకోలము పాలువలె విరిగిపోయినది. ఆమె,బొమ్మ పొత్తికలలో తారాడు చుండ ఆమె హృదయసీమను వైష్ణవసూక్తములు పాదుకొన్నవి. వైష్ణవులగు తల్లిదండ్రులు ఆ భావ కందళమునకు ప్రోది సేసినారు.

కుసుమసుకుమారజీవితము నల్లుకొనిన అంతము పొంతము లేని లోకాపవాదములను ఆమె గణించినది కాదు. అవి భౌతికశరీరమున కని ఆమె చిఱునవ్వినది.

ఆమె కన్నీరు భక్తిపరము. విశ్వాసము భక్తిపరము. ఊహ, మాట భక్తిపరము. సకలము భక్తిపరము. భక్తి మూర్తిభవించినది: మీరాబాయి అయినది.

మీరా గాయని గానకళాపరిజ్ఞాతి. ఆమె గొంతెత్తిన ఎన్నియో సుషమప్రసూనములు తమ దివ్యామూల్య జీవితములను పదాంకితము చేసికొనెను. ఆమె పాటలో చదలేటికెరటాల నురుగువెన్నెలల మిసిమి కాంతుల గుబగులు నిత్యము మెరసికొనెను. ఆమెకు నలుదెసలనుండి తిరస్కార ఘంటికానిస్వనము వినిపించినది. ఆ నిరాకృతి విశ్వజనని చెవి సోకకుండ గనే ఆమె దైవములో చేరిపోయినది.

౨

"బాజాలు నాన్నా బాజాలు"

"అవును చిట్టి తల్లీ"

"బాజాలతో అదేమిటి నాన్నా!"

"పల్లకీ తల్లీ!"

"పల్లకీ పల్లకీ"

"..........."

"పల్లకీలో ఎవరు నాన్నా?"

"పెండ్లికొడుకు"

"పెండ్లికొడుకు—హహ! హ! హ!"

"అవును చిట్టి తల్లీ"

"పెండ్లికొడుకు—బాగున్నాడుకదూ"

"చాలా బాగున్నాడు"

"నాన్నా! నాన్నా"

"ఏమి చిట్టి తల్లీ!"

"నాన్నా..."

"ఏమి తల్లీ."

"నాకూ కావాలి—నాన్నా!"

"ఏమి కావాలి చిట్టి తల్లీ!"

"పెండ్లికొడుకు."

"హ! హ! హ! హ! పెండ్లికొడుకు కావాలా! చిట్టితల్లీ! అప్పుడే—పెండ్లికొడుకు"

"కావాలి నాకు—నాన్నా..."

"సరే చిట్టి తల్లీ—సరే సరే"

అది వసంతము. నవోషస్సు. అవ్యక్త శకుంత మధురారావములు కల్యాణోత్సవ మంగళ తూర్యారావములలో నిస్వనించినవి, అరుణారుణరాగము పెండ్లికుమారుని కంటికెంపులో తుంపెసలాడినది. ఝేరీభాంకారములతో నృత్యగీతములతో హిమవాలుకా కస్తూరికాగురు ధూపధూమములతో వందిమాగధుల కైవారగీతావారముతో వివాహమహోత్సవము మేరట రాజభవనము ఛాయలనుండి సాగిపోవుచున్నది.

మేరటి సంస్థానాధిపతి రాజారతుసి భాటియా రాణా. అతడు ఆరేండ్ల కుమారికతో సౌధోపరినుండి వసంతనవోదయశ్రీ వి భూ తి ని చూచుచున్నాడు.

నిసర్గరామణీయకమును చూచుచున్న ఆ రాకుమారిని మంగళతూర్యారవములు కైవసము చేసికొన్నవి. పల్లకీయందు పెండ్లికుమారుడు అనంత శ్రీవిభవము నిండార కూరుచున్నాడు. అన్నెము పున్నెము ఎఱుఁగని అమాయికబాలిక పెండ్లికుమారుని వాంఛించినది. తండ్రి, కుమార్తె ఈప్సితము తీర్ప నిశ్చయించుకొన్నాడు.

రాణా వైష్ణవేయుడు. ఆతని కులదైవతము శ్రీకృష్ణభగవానుడు.

౩

"మీరా! మీరా! ఇదుగో అమ్మా! నీ పెండ్లికొడు"

"ఏడి నాన్నా ఏడీ!"

"ఇదుగో..."

"ఆ! ఎంత అందకాడో—ఎం చక్క"

తండ్రి ఒసగిన బంగారు గోపాలమూర్తిని కోర్కెలు పూర్ణించుకొన్న హృదయముతో పేరాసతో తీసికొన్నది. ముద్దుగొన్నది. హత్తుకొన్నది. 'నా పెండ్లికొడుకు' అమృతానందములో క్రేళ్లురికి అవశ యైనది. 'చిట్టి తల్లీ! ప్రతిదినము నీ పెండ్లికుమారుని అభ్యంగనస్నానము చేయించుము—జిలుగువసనములతో భూషలతో అలంకరింపుము—ఆరాధించుకొనుము' అని తండ్రి ఉపదేశము చేసినాడు.

ఆమె చిన్నారి వదనము అమితగంభీరభావముతో గభీరప్రసన్న మయినది. ఆమె లేత హస్తములలో విగ్రహహృదయము పరితోషముతో నిండుకొన్నది. నందనవనములోని కల్పశాఖి జలజలప్రసవములను గురియించినది.

స్వర్గాంగణపాళీవితానములోని ఘంటిక జయవెట్టినది.

౪

కాలమునకు పురోగమనము. మానవుల అభివృద్ధికి పురోగమనము. ఎందులో విపర్యయము సంభవించినను ప్రతివిషయమున ప్రళయము. తుదకు లోకమునకు ప్రళయము.

మీరా వయస్సుతో, ఆమెలో చిన్ననాడు తొలకరించిన భక్తిభావము చిగిర్చి రేకుల విచ్చి పుష్పించినది.

ఆమె భక్తి మూగది కాదు. మాటలను నేర్చినది. పాటలను నేర్చినది.

చెక్కు గీటిన పాల్గాయనాడే ఆమె చిన్నిహృదయమునుండి చిన్నిచిన్ని పాటల వన్నెవన్నెలు సురభీకరించెడివి. ఇప్పుడామె పాటల పాలవెల్లి అయినది.

ఆమె వసంతవయస్విని. చిన్నికృష్ణునియెడ వాత్సల్యము అనురాగము అయినది. అనురాగము ప్రణయమయినది. వసంతకోకిలపాలిక ఆమె గోపాలకృష్ణుని గీతార్చనలతో అర్చించుకొనుచు తన దినచర్యను మధురార్ద్రము చేసికొనుచున్నది. ఆమె కవయిత్రి. ప్రతిదినము నామె నివేదించు గీతికలు ఆమె కపోలకల్పితములు; మథియించిన హృదయమునుండి తొలకరించిన అమృత గీతాకందళములు; ఆమె పాటలు ఉషోదనీకంఠకలకంఠ గానకలములు. ఆమె కంఠమెంత మాధుర్యమో అంత మాధుర్యమామె రూపరేఖ. ఆమె శరీరము సౌష్ఠవము, ఆమె సౌందర్యము, ఆమె వైదుష్యము నానావనీశకుమారుల చెవుల బడినది. నానా దిగంతములనుండి ఆమెకు సంబంధములు వచ్చుచున్నవి.

ఆమె దినచర్య ఒకక్రీడ. వేకువ విరియగనే ఆమె కన్నులు విచ్చును. కన్నులు తెరమకొనగనే ఆమె గళమునుండి పాట రెక్కలను విదళించుకొనును. ఆ పాటతో ఉషస్సతికి ఆహ్వానము. ఉదయాచల సానూపలపాళికల శయించియున్న బాలభాస్కరునకు మేలుకొలుపు. యమునావక్షమును ముద్దాడ దివినుండి దిగజారు తరుణకిరణము పోలిక ఆమె, పాడుకొనుచు గోపాలమూర్తి చెంతకుపోయి అతని స్నిగ్ధహేమకపోలమును తనివిదీర ముద్దాడును.

మూర్కొనును, మోపి ఇచ్చును. కౌగిలించుకొనును. సిగ్గుపడును. ఏవో ఏవో మాట్లాడును. కలహించును. అలుకతో, అరమోడ్పుకన్దోయితో ఆలాపము మాని మలయచాలిత కదంబశాఖికవోలె ఆతావుబాయును.

౫

నుదుట దిద్దితీర్చిన కస్తూరీతిలకము. శరీరమునకు చందనచర్చ. సిగకు మయూరపింఛము. నును బొజ్జకు మొలనూలు. కరాంగుళులలో వేణువు. కృష్ణుడు నవవేణువును కెంపెదవుల నూది బహ్మగీతము నాలపింపనున్నాడు.

“వద్దు. ఏమంత తొందర, నీ అలంకరణమునకు సంపూర్తి. నన్ను అలంకరించుకొని రానిమ్ము. నీ వేణు రంధ్రములనుండి పాటవెల్లువల విరియించెదవు గాని’ అని మందహాసమున మీరా వీడ్కొన్నది. ఆ ఆగారములో దివ్యత్వము పరిమళించుచున్నది. మేలి వితానమునుండి వ్రేలుచున్న వజ్రపంజరమునుండి గోరువంక.

‘రాణా! నమస్తే! నమస్తే! నమస్తే’ అన్నది. అచ్చటకు కంచుకి ముందు వచ్చినది. ఆమె వెనుక రాణా ధీరగమనముతో ప్రవేశించినాడు.

“అమ్మాయి ఇటలేదు; గోపాలమూర్తిని అలంకరించినది. పూజాద్రవ్యముకోసము పోయిఉండును, నీవు హజారమున వేచియుండు కంచుకీ.” ‘చిత్తము ప్రభూ.’ కంచుకి అల్లనల్లన వెడలిపోయెను. కొంతకాలము నిశ్శబ్దము. మీరా శృంగారించుకొని పూలసెజ్జతో, కుముదహృదయమున సోత్సవముతో తాండవించు చంద్రకిరణమువోలిక నర్తించుకొనుచు గోపాలమూర్తిని జేరినది. ప్రసవములను జల్లుచు వర్తుల నృత్యముచేయుచు కుసుమవృష్టిని గురియించి

‘కృష్ణా! ఇపుడు పాడుము. నేనును పాడెదను. నీ పాట మధురమో, నా పాట మధురమో, శారీ! నీవు చెప్పవే’ అని గోరువంకవంక తిరిగి రాణాను చూచి చిన్నపుచ్చుకొన్నది. తల వాల్చుకొనియే అల్లనల్లన పోయి జనకుని పాదముల వ్రాలి లేచినది.

“తల్లీ! సిగ్గిల్లకుము. అవసరకార్యమున వచ్చి నీ పూజకు భంగముచేసితిని” అని రాణా పల్కినాడు.

“లేదు బాబా!”

“చిట్టి తల్లీ...”

“ఏమి బాబా!”

రాణా నిట్టూర్చినాడు. ఏమియు పలుకలేక పోయినాడు. చింతాయుతుడైనాడు.

“ఏమి బాబా ఆలోచించుచున్నావు”

“తల్లీ! నీకు యుక్తవయస్సు వచ్చినది.”

మీరా మోము వాంచికొన్నది.

“మీవారురాజన్యుడు రాణాకుంభుడు నిన్ను ఆకాంక్షించుచున్నాడు. అతని రాజ్యము విశాలము. అతడు వీరుడు. ధీరుడు. సరసుడు. శాస్త్రాభ్యాసి”

మీరా ఇంకను మోమువాంచి ఓరగా నిలిచినది. “నీ కది తగినసంబంధము. అతని ప్రవృత్తి నేనెఱుంగుదును. నీ తలపూవు వాడనీయడు. నిన్ను హృదయమున నిలుపుకొనును. ఏమి తల్లీ!”

మీరా తండ్రివంక చూచినప్పుడు కనులు నిర్మల నీలోత్పలములు.

తల వాల్చుకొని మరల తండ్రివంక చూచినప్పుడు చంచలనీలోత్పలములు.

తలవాల్చుకొని మరల తండ్రివంక చూచినప్పుడు నీరపూరితనీలోత్పలములు.

రాణా హృదయము స్పందించినది. ఆమె కన్నీటి భావమును గ్రహించినాడు దగ్గరకుపోయి శిరము మూర్కొని

“చిట్టి తల్లీ! గోపాలమూర్తి నీతోనే ఉండును. నీ వాతనిని వీడినప్పుడు నిన్నాతడు విడనాడడు. శ్రీకృష్ణమూర్తి చాయనే వసించును.

మీరా వదనమున వెన్నెలరేఖను చూచి రాణా ప్రఫుల్ల హృదయముతో ఆశీస్సు పలికి వెడలిపోయినాడు.

వజ్రపంజరములోని గోరువంక “రాణా! నమస్తే! నమస్తే! నమస్తే!” అని వీడ్కొన్నది.

౬

సువర్ణ భూషణభూషితము లయిన మదకరీంద్రములు. వానివెనుక సజ్జితాశ్వములు. తరువాత పదాతులు. ఆటుతరువాత కరపతాకలుదాల్చిన వందిమాగధగణము. వానివెనుక శారదానవమేఘశకలముల బోలు పల్యంకికలు. వానివెనుక స్యందనశ్రేణి. మరల పదాతులు, బారులు దీరి మీవారు రాజవీధికవెంబడి పోవసాగెను. గజఘీంకారములు, హయహేషానినాదములు; భటజయజయధ్వానములు; మంగళతూర్యారవములు రోదసిని పిక్కటిల్లినవి.

నాడు మీవారులోని ప్రతిజీవికి ఆనందభావమున తలమునకలయినది.

నాడు మీవారు దేవేరి మీరావరుని గృహప్రవేశము సేయ పుట్టింటినుండి తరలివచ్చినది. ఆ మంగళోత్సవము వచ్చివచ్చి రాజప్రాసాదము కడ నిలిచినది. మంగళవాద్యములు మిన్నందెను. నవరత్నఖచితమయిన ఒక పల్యంకి ఉత్సవమునుండి విడివడి రాజభవనములోనికి బోయెను. దానిని ఆరు పల్లకులు అనుసరించెను. వాని ఇరుపార్శ్వముల పరిచారకులు.

ఆ పల్లకి రాజసౌధము దాటి శుద్ధాంతఃపురద్వారము చెంత ఆగినది. బోయీలు పల్లకికలను స్త్రీ పరిచారికావశము చేసి వెడలిపోయిరి.

సువాసినులు అవకుంఠనవతులు కొందరు లోనుండి వచ్చి నిలిచిరి. ఒక సుందరి బంగారు హారతి పళ్లెరముతో ముందుకు వచ్చినది. అఖండకర్పూరము జాజ్వల్యమానముగా వెలిగిపోవుచుండెను. ఆమె హార తెత్తి కాకలీకలస్వనముతో పల్లవి పాడి చరణము పాడినది. ఆ చరణముతో సరసనున్న పురంధ్రీమణులు తమ గొంతుల నెత్తిరి.

పాట ఆగినది. ఆమె మరల నీరాజన మిచ్చినది. ఇరువురుతరళాక్షులు ముందుకువచ్చి పల్లకిలో కూరుచున్న మీవారుదేవేరికి తమ మృదుమృణాల కరముల నందిచ్చిరి. మీరా వారి హస్తసహాయమున బయటకు వచ్చినది. అందరి కనులు మిఱుమిట్లు గొన్నవి. ఒక్క నిముసము కాదు తరళసౌదామని నిలుకడ గాంచినది.

అందరి హృదయములు ఆనందాతిరేకమున ఉప్పొంగినవి.

రతీసతీమణి మర్త్యనారీరూపమున సాక్షాత్కరించినదని వారిహృదయమున నొకభావము మెఱసినది.

ఒక మాంగల్యవతి తిలకముతీర్చి హారతిచ్చినది. మీరా సరసనున్న అత్తగారి పాదధూళిగొని పురంధ్రీయుతయై శుద్ధాంతములోనికి బోవుచున్నది. రాణాకుంభునితల్లి మీరాసరసను నడచుచు కోడలి ముగ్ధమనోహర రూపమును చూచి తలయూచి లోలోన నవ్వుకొని తనివితీరక పదేపదే చూడ సాగినది.

పదేపదే చూచుచున్న ఆమె హాసవదనము కుంచితమైనది, భ్రుకుటికుటిల మయినది. తక్షణమే 'నిలుము' అని మేఘస్వనము. అందరు నిలిచిపోయిరి. పరిచారకులు నిలువున నీరయిరి. పురంధ్రులు ఒకరి మొగము ఒకరు చూచుకొనిరి.

"మీరా! నీ హస్తమునం దదియేమి" అన్నది రాణాతల్లి!! ఆమె ప్రశ్నలో నవార్థము గర్జిల్లినది. "నా గోపాలమూర్తి" ఆమె సమాధానములో సెలయేరు తీయని ఎలుంగుతో గలగల మన్నది.

"ఏమీ! నీవు వైష్ణవివా! నా శుద్ధాంతములోనికి వైష్ణవత్వము లావణ్యరూపమున ప్రవేశించుచున్నదా!! వలనుపడదు" అన్నది రాజమాత.

నారీలోకము నీరవితమాయెను. మీరాపరిచారికలు స్థాణువు లయిరి. మీరాహృదయము కలగుండు వడెను.

"పుట్టినిల్లు ఆరణ మిచ్చినది కాబోలు. ఈమెను లోనికి తీసికొని రావలదు" అని పరిచారికల కాజ్ఞ, చరచర లోనికి పయనము. ఒక్క ముహూర్తములో జరిగినవి.

ఆమె శాక్తేయి.

౭

ఆకారవిభేదము పొత్తునకు ప్రాఁగొడ్డము కాదు, కాని అభిప్రాయ విభేదము పొత్తునకు చుక్కవాలు.

నాటినుండి మీరా మీవారుశుద్ధాంతములో కాలు పెట్టలేదు. ఆమె వాసము ప్రత్యేకప్రాసాదము. ఆమె పరిచర్యకు ప్రత్యేకపరిచారకులు. మీవారు శుద్ధాంతమునుండి ఎగసి ఒక్క ఈగ మీరాభవనమున వాలరాదు. అక్కడి పరిచారకులకు ఇక్కడి పరిచారకులను చూచిన కన్నెఱ్ఱ. ఇక్కడి పరిచారకులకు అక్కడి పరిచారకులను చూచిన శరీరకంపనము.

రాణాకుంభుడు మీరా భవనద్వారము త్రొక్క రాదని మాతృశ్రీయాజ్ఞ.

విచక్షణావిహీనుడయి రాణాకుంభుడు ఆయానను తలదాల్చెను.

కల్యాణము జరిగినదన్న మాటయే కాని మీరా, ప్రియుని ముఖదర్శనము కాని కరస్పర్శము కాని చేసి ఎఱుగదు. ఆమె నిరంతరము తన హృదయాధినేతయైన శ్రీగోపాలమూర్తి చరణసన్నిధినే దినములు పుచ్చుచుండెను. రాణాకుంభుని ప్రవర్తనకు జాలువారిన కన్నీటితో శ్రీకృష్ణుని పదకుశేశయముల నార్ద్రము చేయుచుండెను. అత్తగారి నడవడికి ఉరలు కన్నీటిని శ్రీకృష్ణుని అనిమిషనేత్రముల చూచి అంతర్లీనము చేసికొనుచుండెను.

ఆమెకు విషాదసాదమువలన శరీరకంపనము కలిగినప్పుడు బాలగోపాలుని యాలింగనము. ప్రణయోద్వేలమున పెదవులు చలించినప్పుడు ముద్దుకృష్ణుని కెంపెదవుల ముద్దులపూజ. ఆమె భక్తి, పౌరులచెవులబడి వారిని తన్మయులను చేసినది. కాని ఆమె గాఢభక్తియే యామె జీవితమును కుంచించినది.

అనేకులు అనేకముల తలపసాగిరి. కొందరి తలంపున మీరా అన్నము పున్నె మెఱుగని పారిజాతలతాంతము. కొందరి తలంపున మీరా కశ్మలమును పూర్ణించుకొనిన ఉమ్మెత్తపూవు. ఆ అనేకభావములు రాణాకుంభుని కర్ణపథములబడి ఆతని హృదయమును మలీమసము చేసినవి. మీరా ఆతనికన్నులకు భాద్రపదతమస్విని జలదరించు కారుమేఘఖండము.

౫

"ముచ్చటగా అల్లుకొన్న జడను లాగెదవా! పూలను అట్లు విరజిమ్మెద వేమి?"

"................"

"అదిగో వద్దు. ఇప్పుడు వద్దు. హ! హ! హ!"

"..............."

'నా పెదవితాకిన నీపెదవి మలినమౌను? హ!హ!'

"............"

"ఒక్క పాట పాడవు? నీవు గాయకసార్వభౌముడవట ఏదీ ఒక్క పాట పాడుము"

"........."

" పాడకున్న మానె. ఈవసంతసంధ్యావేళ ఏరితెచ్చిన వకుళములను మాలగా గ్రుచ్చినాను. సరసకు రమ్ము. మెడలో వైచెదను."

"........."

"ఎందుకు మొగము మోరగావంచెదవు. నేనేమి చేసినాను. నాతో మాటాడవు. పలుకవు. పలుకే బంగారమా. నా జీవితవు కదు? పలుకవు. ఒక్క మాట మాటాడు. నీమీద పదమల్లినాను. నీ మనసు వచ్చిన రాగముతో ఆలపించెదను"

"........."

"తలుపు, తలుపు!"

"మీరా ఉలికిపడెను."

"తలుపు, తలుపు, తలుపు!"

"మీరా నిర్ఘాంతపోయి నిలిచెను."

"తలుపు, తలుపు, తలుపు!"

"మీరా తలుపుతీసెను."

ఎదుట రాణాకుంభుడు. కరములోని ముక్తఖడ్గము తళతళ మెరయుచుండెను. నేత్రములు కెందామరలు. భృకుటి కుటిలము. ఆతనిశరీరము నిలువెల్ల చలియించుచుండెను. ఆతని హృదయము అనుమానముతో ఈర్ష్యతో ఉడుకెత్తి పోవుచున్నది మీరా వాతాహత కర్పూరకదళి.

రాణాకుంభుడు, హృదయముగడ్డవారిన మృత్యుభీషణమూర్తి.

రాణా మీరాగదియెల్ల కలయచూచెను. వసంత ప్రత్యూషసమయాంబరమువలె విజనము. నిశ్చలము,

రాణా మీరావదనము చూచెను. శారద జ్యోత్స్నామానివలె స్వచ్ఛము. గభీరము.

"ఎవ్వరితో ముచ్చటలాడుచున్నావు?"

ఆ ప్రశ్నలో చిచ్చరపిడుగులు ఉరిమినవి.

"నా పెండ్లికొడుకుతో".

ఆ సమాధానములో నదీగర్భములోనినిండుశాంతి నిండుకొన్నది.

ఆ ముగ్ధసమాధానమునకు రాణామానసము శత వృశ్చికదంశకమాయెను.

"పాంశులా! నేనుకాక నీ పెండ్లికొడుకు ఎవ్వడు?"

"నీవా. నాయెడ ఇట్లు ప్రవర్తించిన నీవా?! రాణా, నా పెండ్లికొడుకువు......నా హృదయాధిష్ఠానప్రభువు. నా జీవికాజీవిక నా శ్రీగోపాల మూర్తి. అతని దివ్యమంగళమూర్తిని హృదయమున ప్రతిష్ఠించుకొన్నాను. వలపుకన్నీటిపూలతో అభిషేచనము చేసికొన్నాను. వలపుటూర్పులతో నీరాజన మిచ్చికొన్నాను......కాని...కాని...... ఈ వసామాంసావిలమయిన ఈ శరీరము మీవారు దేవునిది. నా హృదయము, నా ప్రేమ, నా విశ్వాసము, నా జీవము శ్రీ కృష్ణపరమేశ్వరునిది. అతడు లోకనేత. నా హృదయనేత. నేను అతని నిత్యసేవకను. అతడు నా జీవనైక సర్వస్వము."

ఆమె ఉచ్చరించిన ప్రతిమాట విశ్వాసమున బరువువారినది. అమాయికత్వమున స్వచ్ఛమయినది. ఆ నిర్మాయికప్రేమవచనములు రాణాకుంభుని నీరవుని జేసెను.

భాద్రపదాకాశమువసంతాకాశమయినది. రాణా కుంభుడు పెదవి మెదపలేదు. నిలుచుండిన తలము నుండి కదలలేదు. అతని భీకరరూపము ప్రసన్నమందినది.

శిరసువంచి చంచలచ్ఛంచలవలె నిలువబడి యున్న మీరాను చూచి నిట్టూర్చి వెనుదిరిగి రాణా కుంభుడు వెడలిపోయినాడు.

౬

మీరా యనిన రాణాకుంభునకు గౌరవతాత్పర్యములు కుదురుకొన్నవి. తన నిరశనాపరాధమునకు జీవితాంతము మీరాచరణజీవితుడు కావలయునని భావించెను. కాని మాతృ శ్రీయాజ్ఞ. అది మేరు పర్వతము. తరింప నశక్యము.

రాణాకుంభుడు మీరాకొరకు గోపాలాలయము నిర్మించెను. అది మీరాకు ఆనందగీతి. రాజమాతకు హృదయశల్యము.

మీరా ఉభయసంధ్యారాధనలు వెలితిలేకుండ జరగిపోవుచుండెను. ఉభయసంధ్యల ఆరాధనగీతలతో గర్భాలయము ప్రతిధ్వను లీనిపోవుచుండెను. ఆ గానామృతవృష్టికి ఆ దేవాయతనావరణమున మంకెనప్రసూనములు తామరతంపరలైనవి.

ఆ మధురగానము నాలింప శాస్త్రియులుకూడ వచ్చి ఆ గానకల్లోలమున కూగాడి తన్మయత్వమున కృష్ణదేవు చరణాంకపీఠి కచ్యుతప్రసూనముల వలె వ్రాలుచుండిరి. ఆమె భక్తికి విపశులయి ఆమె చరణవిన్యాసములో తమ చరణవిన్యాసములు కలుపుచుండిరి.

అది శిశిరవాసరము. కరినెలంతలు మాగన్ను పెట్టుకొన్నవి. మునిమాపుననే చల్లగాలి. మీరా ఎట్టులెట్టులో కొన్ని ప్రసవములనేరి ఏరి వనమాలికి ఒక్కమాలిక కూర్చుచుండెను. ప్రకృతి వివృత యయినదని నాడు మీరా భువనమోహనముగా నలంకరించుకొన్నది. ఆమె పోషితమయూరము పురివిచ్చి దూరమున నర్తించుచు సారెసారెకు అర్రెత్తి ఆకాశమును చూచుచుండెను.

ఇంతలో శుద్ధాంతకాంతలు అచ్చటకు వచ్చినారు. ఆమెను చూచి ముసిముసి నవ్వుకొన్నారు.

"ఈమెకు లోకవాసనలు విడువలేదు. ఏమి వైరాగ్యము" అన్నది ఒక్క వనిత.

"ఈమె పుణ్యనదీస్నాతయైనట్లు గోచరింపదు. ఏమి భక్తి" అన్నది ఒక్క లతాంగి.

"ఈమె కందమూలఫలాదికము నారగింపనే యారగింపను. ఏమి పూజ" అన్నది ఒక విధుముఖి. "ఈమెకు మంత్రశ్లోకములు రావు. కిన్నరివలె చక్కగా పాడును. ఏమి అర్చన" అన్నది ఒక మంజుఘోష. మీరా వారి వచనములను విన్నది. క్రోధవివశయయినది కాదు. వినీతిని వీడుకొన్నది కాదు. గోపాలమూర్తిని హృదయమున అర్చించుకొన్నది. "అవును. సత్యమే. నన్ను లోకవాసనలు విడువలేదు. గంగాస్నాన మాచరింపను. కాయకసరులతో నిమిత్తములేదు. మంత్ర తంత్రముల నెఱుగను. నేనేమియు నెఱుగను. నేను ప్రేమించుటనే ఎఱుగుదును. పొరపొచ్చెములేని హృదయముతో; ప్రతిఫలశూన్యమయినకాంక్షలతో ప్రేమించుట ఎఱుంగుదును. నిజమే. నేను కిన్నరీకాంతవలె గానము చేయుదును. నా గానము నా జీవితము నా గోపాలచరణాంకితము" అనుకొనుచు నాడు రచించిన గీతికాలాపముతో నృత్యము చేసికొనుచు తాను కూర్చిన కుసుమదామమును శ్రీకృష్ణుని గళసీమ నలంకరించెను. ఆమాల కృష్ణుని హృదయము సోకగనే కృష్ణుడు విస్ఫారవిలోచనముల నవ్వెను. ఆ కృత్యమును సరసనున్న నాకిలోకము చూచినది. వెలవెల్లబోయినది. ఆమె భక్తికి తల వాల్చినది.

ఆ పొలవెల్లిలో వారు తరంగితులైరి. వారు కూడ ఆమె పదవిన్యాసములో తమ పదవిన్యాసమును కలిపి ఆమె గొంతుతో గొంతు కలిపిరి. భక్త్యావేశుల హృదయములలో స్వమతవిమత విభేదమునకు తావులేదు.

౧౦

మీరా గానము మీవారుహృదయమునే కాక హిందూహృదయమును పులకితము చేసినది. ఆమె ఆరాధనాగీతికలు ఆబాలగోపాలము ఆలపింప సాగినవి.

మీరా భక్తురాలు. గానకళాసరస్వతి అని దేశములు తలవాల్చినవి. ఆమెను దర్శించుటకు, ఆమె గాన మాలించుటకు హరిదంతపదములనుండి ప్రజ వచ్చుచున్నారు. మీవారు యాత్రాస్థానమయినది.

ఆమె దినము దినము నూతన గీతికలను నూతన రాగములతో రాజపుత్రస్థానము ముంచెత్తివేయుచున్నది ఆమె నిత్యకృత్యము శ్రీకృష్ణారాధన. ఒక్కవేళ అపూర్వశోభామయియయి కృష్ణుని అర్చించును. మరియొక్కవేళ సర్వసాధారణయయి గోపాలుని పూజించును. ఆమె ఆరాధనకు లేనిపోని భేదములేదు నిశాదిన విభేదములేదు. ఎల్లవేళల ఆమె హృదయము పూజావినీతము. ఎల్లవేళల గోపాలాలయము నిత్యకల్యాణము పచ్చతోరణము. ఆమె సంసారజీవితము మాత్రము విరహరేఖ.

౧౧

"జహాపనాహ! సూర్యుడు గ్రాలినాడు. మీరా దేవి వచ్చువేళ అయినది" అనినాడు తాన్‌సేను.

"ఇంకను రాలేదే. వచ్చుచున్నదా?"...అని పలికినాడు అక్బరుపాదుషా.

"జహాపనాహ! వచ్చువేళ యయినది. దయచేసి తమ రాచమర్యాదల నిచట........" అనినాడు తాన్‌సేను.

"పాటింపను సోదరా! మీరాదేవిఎదుటనా నా సార్వభౌమత్వపదవి" అని తాన్‌సేనుభుజము తట్టినాడు.

తాన్‌సేను చిరునవ్వినాడు. పాదుషా చిరునవ్విన ఆ ఇరువురు కలసి చిరునవ్వినారు.

ఒకరి తరువాత ఒకరు వచ్చి భక్తిపరులు ఆలయ వితర్దికలమీద నిషణ్ణులగుచున్నారు. నాడు మంగళదినము. ఇతఃపూర్వముకన్న నాడు మీరా దేవతార్చనకు సంధ్యతో వచ్చును.

దేవాలయము నంటియున్న ఉద్యానమార్గమున బడి మీరా వచ్చుచున్నది. ఆమెవెనుక ఇరువురు పరిచారకులు. పూజాద్రవ్యములు పళ్లెరము ఆమె

చేత నేయుచున్నది. ఆమెను జూచి దేవాలయము ప్రశాంతమయినది. ఆ ప్రశాంతిలో అనంతమంగళ జ్యోతులు వికాసిల్లినవి. మీరా వల్గుగమనమ్ముతో అక్బరుపాదుషాసరసనుండియే గర్భాలయమునకు పోయినది. అక్బరు అనిమిషుడయినాడు. తాన్‌సేను పాదుషాఉత్సేకమును అనునయించినాడు.

మీరా సంధ్యాగీతితో పూజాదికమును ప్రారంభించినది. జయఘంటిక మొరసినది. పూవులు కురిసినవి. ఆమె గానమునకు అక్బరు ఆనందమున త్రుళ్లింత లాడినాడు. మరల మీరా గానముచేసెను. ఇప్పుడు గీతిలేదు. రాగములేదు. అక్బరు తన్నుదాను మరచెను తాన్‌సేను తన వివశతలో అక్బరుని తేల్చెను.

పూజ సమాప్తించినది. మరల జయఘంటిక మ్రోగినది. పూవులు వర్షించినవి. కృష్ణుని ఎదుట మీరా మోకరిల్లినది.

“ఇంకొకసారి, ఇంకొకపాట. నా జీవితము ధన్యము” అన్నాడు అక్బరుపా.

“చిత్తము” అన్నాడు తాన్‌సేను.

మీరా నిశ్చలసమాధినుండి లేచినది. తాన్‌సేను గాన మాలపించినాడు. అంతటి గానమును మీరా విని చకితయైనది. నిలిచినచోటనే నిలిచిపోయినది. అతనిపాటకు సమాప్తి. ఈమె పాటకు ఉదయము. దేవాలయమును మరియొక్కసారి ప్రశాంతి పక్షము లావరించుకొన్నవి. మీరాగాన మయినది. అక్బరు ముందుకువచ్చి, “దేవీ! నీ భక్తి అపారము. నీ గానము అపరూపము. ఈ నిరుపేద ఏమీయ గలడు” అని ఒక వజ్రాలహారము ఆమె కొసగి అంజలించెను. మీరా ఆ హారమును చూచి విస్మయంపడినది. “ఈ అమూల్యహారము........” అనుచున్నది. “నేను పూర్వాశ్రమములో రత్నాల వర్తకుడను. ఇప్పుడు నా వ్యాపారము చిదికిపోయినది. ఈ హారముమాత్రము మిగిలినది. ఈ హారము మీ కుపహారము” అని అక్బరుపా ధీరగమనమున దేవాలయసోపానశ్రేణిని అవతరించెను. తాన్‌సేను అతని పదములలో పదములిడెను. మీరా ఆ హారముతో కన్నులు మూసికొని అట్లే నిలిచినది. కన్నులుతెరచి గోపాలమూర్తిసరసకు పోయి ఆ హారము కృష్ణగళాంకితముచేసి “నమస్తే ప్రభూ! నమస్తే ప్రభూ! శీతాంశోరమృతాగ్రణమ్” అన్నది.

౧౨

ఆ వజ్రహారము అక్బరుపాదుషా దని నిర్ధారించినారు. అక్బరుపాదుషా ఆ దేవాలయమునకు రహస్యాచారము చేయుచున్నాడని కోడెత్రాచువలె బుసకొట్టినది. కర్ణాకర్ణి రాణాకుంభుని చెవిసోకినది. రాణా ఈర్ష్యతో కోపముతో ఉన్మత్తదిష్టుడయినాడు. అకళ్మలభావముతో మీరా భవనమునకు మరల నింకొకసారి ప్రవేశించినాడు. అదియేతుది.

అతని అవస్థ పూర్వముకన్న భీకరముగానున్నది. అత డెందుల కచ్చుటకు వచ్చినాడో ఆమెకు తెలిసిపోయినది. ఆమెకు భయములేదు. విచారములేదు. కాని అతనినిచూచి మీరా జాలిపడినది. ఎంతటి అఖిలరూపమును ఆమెను స్వర్గీయానంద సౌఖ్యమునుండి చ్యుతము చేయలేదు. ఆమె అచల, ఆమె పూజామతి. ఆమె గాయిని. ఆమె శ్రీ గోపాలమూర్తి చరణదాసి ఆమెకు భయములేదు; విచారములేదు.

“ఆ వజ్రహారము ఎక్కడిది?” అని కలమేఘము స్వనించినది.

“శ్రీ గోపాలకృష్ణుడు లీలాపురుషుడు. అతనికి వలసి తెప్పించుకొనెను. ఇచ్ఛతో అలంకరించుకొనెను” అని మీరా కలకంఠకంఠమున పలికినది.

రాణా క్రోధమున చలించిపోయినాడు. అతని ఉత్సేధము కంపించి పోవుచుండెను. ఓరిమి భూమిని చేరుకున్నది. రాణా అటునిటు చూచి కరతాళము గావించినాడు. పరిచారిక ప్రవేశించి రాణాకు మ్రొక్కినది. ఆ దాసీకన్య హస్తమున విషపాత్రిక. ఆ పాత్రికను రాణా గ్రహించి మీరా కొసగినాడు. ఆమె కిమ్మనకుండ పుచ్చుకున్నది.

"త్రాగివేయుము" అని శాసించినాడు.

ఆమె క్రిందు మీదు చూడక ఒక్కపరి కన్నులు మూసి కన్నులు తెరచి ఆ విషపాత్రికను నోసటకు హత్తుకొని త్రాగివైచినది. ఆమె శరీరమంతయు ఒక్కపరి హరిద్రవర్ణమైపోయినది. ఉత్తరక్షణము ననే ఆమె నిసర్గమహస్సుతో ప్రకాశించినది. ఆమె చెక్కుచెదరలేదు.

రాణా నిస్తబ్ధుడు నీరవుడు అయినాడు. నేత్రముల దృష్టి సన్నగిల్లినది. వెర్రివెర్రిగా చూచుకొనుచు ఆ దివ్యతలమును బాసినాడు. ఒక గడియకు కంచుకి అచ్చటకు వచ్చినాడు. మీరా ఇంకను అచ్చటనేయున్నది. ఆమెకు రాణావారి శ్రీముఖమందిచ్చినాడు.

"మీరా! నీవు పాంసులవు. నిన్ను నిర్వాసితను చేసినాము".

౧౩

మీరా! బయలుదేరినది. మీవారుశుద్ధాంతము వీడి బయలుదేరినది. ఆమె వెడలునపుడు మీవారునకు సంబంధించిన ఒక జీవిసహితము సమాశ్వాస వచనము పకలులేదు. కరుణాప్రసక్తి చేయలేదు ఒక్క నేత్రము తడివారలేదు. శరీరమునుండి ఒలిచివేసిన అలంకారవారమును శయ్యాతలముమీదనే ఉంచివేసినది. ఏకవస్త్రముతో ఏకతారతో ఆ నడికిరేయి శుద్ధాంతమును వీడి ఎటకో ఎటకో బయలుదేరినది. ఆమెకు దారితోడు జగతీతలమును కారుకొన్న అంధతమస్సు. హృదయములోని శ్రీ కృష్ణభగవానుడు. ఆమె ఉడుకెత్తిన హృదంతరమునుండి తీగలువారుచున్న పాటపదములు పాటల వెలుంగువెల్లికలు ఆ భీషణతామిశ్రమును ప్రకాశము చేయుచుండెను. ఆమె నడక సుగమమగుచుండెను. ఆమె హృదయము నిష్కామపరిపూర్ణము. శ్రీ కృష్ణమూర్తియుండే ఆవాసము. వీక్షలో కృష్ణ. నిట్టూర్పులో కృష్ణ. కన్నీటిలో కృష్ణ. పాటలలో కృష్ణ. ఆమెకు తెలియకుండగనే ఆమె పదములు బృందావనసీమకు దారిపట్టినవి. తెలతెల వేగినది. నాడు శకుంతగీతాకలకలముతో ఆశావీధులు ముఖరితమగుటలేదు. ప్రత్యూషఃపథము మీరా దివ్యపదముల తోరణవారముతో ప్రేల్లితమగుచుండెను. జనపదములనుండి పక్కణసీమలనుండి విపినవీథులనుండి జనులు మీరాపాటలతో ఆమంత్రింపబడుచుండిరి. ప్రత్యూషస్సతీవదనము అరుణరంజితము. మీరా హృదయము కృష్ణానురాగప్రసన్నము. జనుల హృదయము భక్త్యుత్సాహవిలసితము. రాణాకుంభుడు ఆమెను వీడినాడు. జగతి యామెను చేపట్టినది. జోహారు పెట్టినది. జయు పెట్టినది.

నాడునాడు ఆమెకు ఛాత్రగణము విశేషించిపోవుచున్నది. ఆమె ఎక్కడ మజిలీచేసిన అక్కడనే మహాజనసంక్షుభితనగరము. ఆ బృందావనయాత్రల నివేశమేని కష్టము నీయలేదు. ఆనందము నిచ్చినది. అనుచరుల నిచ్చినది. పాటల నిచ్చినది. జీవనము నిచ్చినది. శ్రీ కృష్ణమూర్తి సన్నిధి చేర్చినది. శరత్కాలవిపాకమున ఆమె బృందావనసీమను చేరుకున్నది.

౧౪

ద్వారక కఠేవాడలోని పట్టణము.

పవిత్రబృందావనసీమలో కొన్నినాళ్లు గడపి ద్వారకకు మీరా పయనించినది. ఆమె జీవితశేషము అచ్చట గడుపదలచినది. శ్రీకృష్ణుడు తన జీవితశేషమును అచ్చటనే వాసింపచేసినాడు.

మీరాపాటలు వినుటకు, ఆమెగాన మాలించుటకు ఆమె భక్తిని చూచి పారవశ్యము నొందుటకు వైష్ణవేయులు, భక్తులు నానాదేశములనుండి వచ్చి ఆమెను పలమట్టుచుండిరి. వచ్చినవారు వచ్చినట్లే యక్కడ నిలిచి ఆమెను కొలువసాగిరి. మీరా పడిసిన వటచ్ఛాయ ఆశ్రమపదమయిపోయినది.

మీరా భక్తిగేయములు ఉత్తరహిందూస్థానములో దొప్పలు దోగినవి. ఆమె భక్తికి నిస్సీమ. ఆమె, పాటలో లేదు. పాటలో శయించును.

ఆమె ఆహారము తీసికొన్నదో లేదో ఎవ్వరికి తెలియదు. ఆమెకు తెలియదు. దినము దినము ఆమె కృశించుచున్నకొలది ఆమెలో మహామహత్త్వము వెలిగిపోవుచున్నది.

మీరాగేయములు రాణాకుంభుని చెవిని బడినవి. మీరాభక్తితత్పరత జనులవలన విన్నాడు. ఆతని కఠినహృదయము కరగజొచ్చినది. రాణా, మీరాపవిత్రజీవితము విన్నాడు. ఆతని అనుమానహృదయము పునీతముకాజొచ్చినది. భక్తులనోట మీరాపాటలు. భిక్షుకుల నోట మీరాపాటలు. వైష్ణవులనోట మీరాపాటలు. శైవులనోట మీరాపాటలు. ఆనాడు ఈనాడువలెనే ఉత్తరహిందూస్థానము మీరాపాటపదములతో నిబిడీకరించిపోయెను. మీరాపాటలను విన్నకొలది, ఆమె జీవితము నాలించినకొలది రాణాహృదయము మీరాకయి తపించిపోవుచుండెను.

ఆమె సాక్షాత్పరదేవత, తాను ముగ్ధుడు అన్నభావము ఆతని హృదయమున రేగినది. ఆ భావమును ఉభయసంధ్యల వీనులబడుచున్న ఆ వరగాయనీ గేయములు ప్రోదిచేయుచున్నవి. ఆతనిలో ఆందోళనము రేగినది. అంబరము నీరదనీరంధ్రము. వాయువు ప్రచండముగ వీచుచున్నది. ప్రకృతిమూర్తి ఉన్మత్తపోలిక కొట్టుకొనిపోవుచున్నది. ఆ ప్రళయవేళ రాణాకుంభుడు మీరాదేవికయి బయలుదేరినాడు.

౧౫

ఆది శ్రావణమాసము. నాడు జన్మాష్టమి—శ్రీకృష్ణుని జన్మదినము. ఆ జన్మవాసరమున ఆ మంగళోత్సవము చుహలక్షింప జనులు దేశదేశములనుండి ద్వారకకు విచ్చేసిరి. ఆ కృష్ణదేవాయతనము నూతనము. భారతచిత్రములు భాగవతచిత్రములు ఆలయభిత్తికలమీద చిత్రింపబడెను. దేవళమంతయు నవజీవనచైతన్యము తొలుకాడు కుసుమజాతములతో చిత్రవిచిత్రగతుల విరచింపబడెను. నాడే ఆ నూతనదేవతాయతనమున విగ్రహప్రతిష్ఠ. మీరా హృదయము అమృతానందమున తుందిలము. ఆనాటికి మీరా ఎన్నియో నూతనగీతల నల్లెను.

గర్భాలయము దీపావళితో విరాజమానముగానున్నది. అగరుధూపముతో దేవాలయము గుమాళించుచుండెను. కర్పూరము అఖండముగ వెలిగిపోవుచుండెను. శుభముహూర్తము దగ్గరిల్లెను. అవనీసురులు మంజుఘోషతో మంత్రోచ్చారణము సలుపుచుండిరి. మీరా మంగళస్నాత అయినది. నూతనగీతాలాపము చేయుచు చిఱుతప్రాయమునాడు తండ్రి ఉపాయనముగానిచ్చిన బంగారు గోపాలమూర్తిని శుభముహూర్తమున ఆ గర్భాలయమున ప్రతిష్ఠించి సోత్సవనృత్యము చేయసాగినది. ఆ లీలాతాండవములో దిదృక్షుల ఆనందము తేటగీతులయినది.

విగ్రహప్రతిష్ఠ జరగిపోయెను. జయగోవిందవాక్యము దేవాలయపథము దాటి సాగరోత్తుంగభంగవీధి ప్రతిధ్వను లీనసాగెను. మట్టమధ్యాహ్నమాయెను. ఆలయము విజనమాయెను. మీరా ఇంకను గోపాలమూర్తి సమక్షమున సాష్టాంగపడి ఉండెను.

ఆ నూతనాలయప్రాంతమున హయహేషలు గజఘీంకృతులు వినవచ్చెను. అంతకంతకు ఆ ఘోష దగ్గరిల్లెను. ఆజానేయములు, తరువాత రాజసేవకులు, చతురంగయానములు, ఆటుపయి మత్తకుంభీంద్రములు. ఒక మదకరిపై మీరట్టురాజకేతనము వాయుచాలనమున చలితమగుచుండెను. ఒక బంగారుపల్యంకిక వచ్చి దేవాలయదేహళిచెంత నిలిచెను.

మీరా గర్భాలయమువీడి ద్వారకవాటముజేరి చతురంకయానములోని పురుషపుంగవుని చూచి వినీతితో నమస్సు లర్పించి దేవాలయద్వారమును బంధించుకొనెను.

ఆ పురుషపుంగవుడు రాణాకుంభుడు. మీవారుప్రభువు మీరాదేవిని తీసికొనిపోవ వచ్చినాడని

ద్వారక పౌరులకు తెలిసిపోయెను. మరల నొకసారి దేవాలయప్రాకారమును జనులు వలజుట్టిరి.

మధ్యాహ్నము దాటెను. సూర్యుడు కైవాలుచుండెను. ఇంకను ఆలయకవాటములు వివృతములు కాలేదు. రాణా హృదయము తామరాకుమీది నీటికణము. ప్రజ హృదయము ఆశ్చర్యసంకలితము.

సూర్యభగవానుడు హారిద్రవర్ణముతో నస్తమించెనని జ్యోతిష్కులు ఏదియో గుణించుకొనిరి. ఇంతవరకు నీరవితుడుగానున్న రాణా ఆలస్యమున ఓర్వలేకపోయెను. ఆలయద్వారములను బలవంతముగా తెరచివేయుడని భటులకు నిదేశము. ద్వారములు తెరువబడెను. రాణా త్వరితముగ లోనికి పోయెను. ఆలయము శూన్యము. మీరా గోచరింపలేదు. రాణాహృదయము స్పందించెను. చరచర గర్భాలయమును ప్రవేశించెను. గర్భాలయము శూన్యము.! రాణాహృదయము శూన్యము. మీరా దాల్చిన పీతాంబరము పూజావేదిక చెంతనుండెను. భక్తహృదయమును తనలో లయింపచేసికున్నందులకు శ్రీ కృష్ణమూర్తి కిలకిల నవ్వుచుండెను. రాణా అది చూచెను. నిట్టూర్చెను. సంధ్యాసౌందర్యరేఖ అస్తమితమోగర్భమున విలీనమాయెను.

ఆంధ్రసోదరా!

శ్రీ మాదిరెడ్డి సూర్యనారాయణరావుగారు

చ॥ వగగ్రుయింపఁబోకుము; సుభాషితమిచ్చెనభీష్టసంతతుల్।
మగువలఁబోలె యేలనిటు ప్రాన్పడియుండెదో? నీకుఁ బాఁడియే?।
తగదిఁక; మేను పెంచియుఁ బ్రతాపముఁ గాంచుట ధర్మమిప్డు; నీ।
కుఁగల సమస్తమున్ విడుము కొంచక భారతరాజ్యలక్ష్మికై॥

చ॥ అనుపమదివ్యబోధ మహిమాధికులయ్యును నొక్కఁడన్నదా।
ఘనమగునంత రాయములుఁ గైకొనరే? యిక రాజ్యలక్ష్మిదా।
ననితర సాధ్యమానినిన; నజ్ఞతఁగాదె? సుకీర్తివచ్చునే?।
వినుతినిఁ గాంచుమయ్య! ఘనవీరుఁడవై యిల "నాంధ్రసోదరా!॥

చ॥ పలుమరు రాజ్యభాగ్యమునుఁ బట్టెఁ బ్రయత్నము సేయఁగావలెన్।
సలుపక యూరకుండనది చాలమియందురు గాదె? యింకనీ
పలుకుల "నోస్వరాజ్య" మనవచ్చునె? అయ్యది స్వప్నవృత్తమే!!
సలిఁపెనుఁ గార్యవీరులకు శౌర్యమెయుండిసఁ జూపఁగావలెన్॥

ఉ॥ చేకుఱు నాత్మశక్తి హృదిచింతితకార్యసమృద్ధి, కీర్తియా।
పై కలుగున్: దృఢంబగు స్వయంకృషి చాతురి నవ్వి గల్గుదో।
నేకమనస్కృతిం బరుప నెవ్విధిఁగల్గు యసాధ్యకార్యముల్?।
ప్రాఁకట "యాంధ్రసోదర" స్వరాజ్యముఁ గైకొనుమయ్య ప్రేల్మిడిన్॥